# అనామిక

ఆకాశంలో మేఘాలు దట్టంగా అలుముకుని వున్నాయి. ప్రకృతంతా గాఢాంధకారపు ముసుగు వేసుకుని వుంది. రాబోయే ప్రళయానికి చిహ్నాల్లా వుండివుండి పెద్ద పెద్ద ఉరుములు ఉరుముతున్నాయి. అప్పుడప్పుడూ మెరిసే విద్యుల్లతల వల్ల ప్రకృతికన్య, తన మేలిముసుగును కాస్తతొలగించి, విశాల విశ్వాన్ని పరికించి చూస్తున్నట్లుంది. అన్ని జీవరాసులూ నిద్రలో మునిగినట్లున్నయ్!

కానీ శారదమాత్రం ఏదో వ్రాస్తూనేవుంది ఇంకా. షుమారుగా రాత్రి ఒంటిగంట కావొస్తోంది. ప్రకృతి చేసే భీభత్సంగానీ, ఉక్కగానీ, ఆమె కలానికీ, భావవేగానికీ అడ్డు రావటంలేదు. అప్పుడప్పుడూ కళ్ళెత్తి, టేబిల్ మీదున్న తను వ్రాసిన కాగితాలకేసి సాలోచనగా చూస్తూ, తిరిగీ వ్రాయటంలో మునిగిపోతోంది. హఠాత్తుగా ఆమెదృష్టి కిటికీగుండా, బయటికి పడింది. ఆ కారుమేఘాల్నీ గాఢాంధకారాన్నీ చూచేసరికి గుండె గతుక్కుమంది. టేబిల్ లైటు కేసి రెప్పపాటు కాలం చూచి మళ్ళీ మొదలెట్టాలని కలంతీసింది కానీ, వెనక అడుగులచప్పుడు విని, ఆ ప్రయత్నం విరమించుకుని వెనక్కు తిరిగి చూచింది.

"ఇంకా నిద్రపోలేదూ శారదా ?" రాజేశ్వరి ప్రశ్న గదిలో ప్రతిధ్వనించింది.

"ఊహూఁ ఏం తోచటం లేదొదినా! ఏదో ఒకటి..." తడబడ్తూ తత్తరపాటుతో చూచింది శారద.

"మరి తోచలేదని అలా అర్థరాత్రి వరకూ వ్రాస్తూ కూర్చుంటావా ఏం? ఆ వ్రాతలేమైనా అచ్చౌతున్నాయా ఏమన్నానా!" రాజేశ్వరి వ్యంగ్యంగా అంది. శారద మనస్సు చివుక్కుమంది. ఆ మధ్య తను వ్రాసిపంపిన కథలు రెండు, మూడు కొన్ని వారపత్రికలకు పంపితే, అవి తిరిగొచ్చాయి. అందుకే రాజేశ్వరికి శారద రచనలంటే చులకనభావం.

"పోన్లే వదినా! అవి అచ్చైనా కాకున్నా, నా భావనా శక్తిలో విలువ లేదనటానికి వీల్లేదు!" అంది కోపంగా శారద.

"అబ్బబ్బ! నీతో ఈ అర్థరాత్రి వాదించటానికి రాలేదు శారదా! బయట చూడు! ఎలా మబ్బు పట్టివుందో! పెద్ద వానొచ్చేలావుంది! ఉక్కపెడుతోంది. నీ గదిలో వెలుగుతున్న లైటు వరండాలో నా కళ్ళమీద పడుతోంది. కాస్తంత వెల్తురు పడినా, ఇక నిద్రపట్టదు! ఇంకానయం మీ అన్నయ్యగారింకా లేవలేదు! కాస్త లైటాఫ్ చేద్దూ! నీకు పుణ్యముంటుంది. పగలంతా వ్రాసుకోవచ్చా గ్రంధాలు! తీరా ఆ బాబిగాడు లేచాడంటే, ఇక వాడూ నిద్రపోడు, నన్నూ నిద్రపోనివ్వడు!......" రాజేశ్వరి ఇక జవాబాశించకుండా గబగబ వెళ్ళిపోయింది.

ఒదిన ప్రవర్తనకు ఒళ్లు మండిపోయింది శారదకు. ఆమె వెళ్ళినవేపే చూస్తూ ఆలోచనల్లో మునిగిపోయింది. తన రూంలో లైటువల్ల, ఆమెకు నిద్రాభంగమా? అందులోనూ, వరండాలో పడుకునివున్న ఆమె కళ్ళమీద, తనగదిలో వెలుగుతున్న టేబిల్ లైటు వెలుతురు పడ్తోందా?

పగలు తనకు తీరికేది? ఆ సంగతి ఒదినకు తెలియదా? తెలిసినా, తెలియనట్లు నటిస్తోందా? ఒదినకు ఎప్పుడూ జబ్బే! అంచేత ఆవిడకు ఏ పనీ తగలనివ్వకూడదు! అస్తమానం వంట మొదలు, ఫలహారాలు చెయ్యటం, కాఫీలు చెయ్యటం, వచ్చిన అతిధులకు అందివ్వటం వరకూ అన్ని పన్లూ, బాధ్యతలూ తనవే. ఇక మధ్యమధ్యలో బాబిగాడిని చూచుకోవటం, ఆడించటం, పాలుపట్టటం, నిద్రపుచ్చటం కూడా తన వంతే!

ఎప్పుడో, తీరిక చిక్కినప్పుడు, కాస్సేపు వ్రాసుకుంటుంది! ఖర్మంచాలక తనకే తలనొప్పి వస్తే చాలు, ఒదిన విసుక్కుంటుంది పెద్దగా! "ఆ పనికిమాలిన రాతలెందుకు శారదా? అంటే వినవు! ఓ గొప్ప రచయిత్రివి కావాలని ఎందుకంత ఉబలాటం? అలాటి అదృష్టమే వుండివుంటే, అదృష్టాలెందుకిలా తగలడతాయి?" అంటుంది!

అవును! అదీ నిజమేనేమో? "అదృష్టాలెందుకిలా తగలడతాయి?" నిజమే! తనకూ ఓ భర్తా, ఇల్లూ, పిల్లలూ అంటూ వుంటే, అందరిలా తనూ ఆనందంగా జీవించేది కాదా? కానీ దేవుడు తనకా రాత రాయలేదు! వితంతువనే బిరుదును ప్రసాదించి, జీవితాన్ని మోడులా చేసి, ముళ్ళబాటలో నడవమని, గునపంతో తన నుదుట వ్రాశాడేమో దేవుడు?

"నా మాటంటే ఈ కొంపలో ఎవరికి లక్ష్యముందిగనక ? నాకెందుకొచ్చిన గొడవలెండి? నిద్రలేకుంటే నాకేగా రోగ మొస్త?" రాజేశ్వరి పెద్దగా అరుస్తోంది!

"ఎవరూ ? శారదా ! ఇంకా నిద్రపోకుండా ఏం చేస్తోంది?" అన్నయ్యా సూర్యనారాయణ కంఠం ఖంగుమంది !

ఉలిక్కిపడింది శారద !

వీళ్ళిద్దరికీ ఎందుకింత పంతం ? కోపం? అసూయ? ఏవేవో అస్పష్టమైన ప్రశ్నలు, శేషప్రశ్నల్లా చుట్టు ముట్టాయి ! వ్రాస్తున్న కాగితాలు టేబిల్ సొరుగులో కుక్కి, టేబిల్ లైటు ఆర్పి, పడుకుంది శారద! ఆమె ఎప్పుడు నిద్ర పోయిందో ఎవరికీ తెలియదు !

* * *

ఈ వారం రోజులూ శారద తన రచనను నిర్విఘ్నంగా కొనసాగించు కొంటోంది! ఆమె కలం చిందులు త్రొక్కు తోంది. భావాలు తీవెల్లా, అందమైన పూవుల్లా, అల్లుకు పోతు న్నాయి! ఈ వారం రోజులూ, పగలూ, రాత్రీ తన రక్తాన్ని కలంలో నింపి వ్రాస్తోన్నట్లుంది శారద !

కోపమో ఏమో, రాజేశ్వరి ఏమీ అనటం లేదు ! బాబి గాడి సంగతంతా స్వయంగా చూచుకొంటోంది ! ఇంటి పనులు తనే చేసుకొంటోంది. శారద ప్రాణం తేలికగా వుంది!

ఆ రోజు. అర్ధరాత్రి మూడు గంటలు కావొస్తోంది ! ఆఖరు పేజి అప్పుడే పూర్తి చేసి, ఉత్సాహంగా ఊపిరిపీల్చుకుంది

శారద! సొరుగులోని కాగితాలన్నీ తీసి, నంబర్లు వేసి, జాగ్రత్తగా వరుసక్రమంలో పేర్చింది! తిరిగీ ఓసారి తప్పులు సరిదిద్దుకోవటానికి చదవటం మొదలెట్టింది!

కాగితాల మీద పరుచుకుని వున్న ముత్యాలను ఏరుకుంటున్నాయి కళ్లు! వాటి విలువనూ, అందాన్నీ లెక్క కడుతోంది మనస్సు! ఆ భావాల పొందికకూ, భాష కూర్పుకూ, ఆశ్చర్యం కలుగుతోంది ఆమెకే! తన రచనలోని స్త్రీ పాత్ర, ఓ అభాగిని! ఆవేదనా, అనురాగమూ, విశుద్ధ అంతఃకరణా సమపాళ్ళల్లో నిండివుండే స్త్రీ ఆ పాత్ర! ఆ పాత్ర సజీవ రూపం దాల్చి, తన ముందు నిల్చుని, తన గాథ చెప్పుకొంటున్నట్లు అనుభూతి కలుగుతోంది శారదకు! శారద కళ్లు చెమరుస్తున్నాయి కూడా!

"శారదా! ఏమిటమ్మా?" సూర్యనారాయణ కంఠం దగ్గరలో విని త్రుళ్ళిపడింది శారద.

"...నవల..." తడబడుతూ చెప్పింది శారద.

"ఊ!" మరేమీ మాట్లాడకుండా వెళ్ళిపోయాడు సూర్యనారాయణ.

చదవటం పూర్తిచేసి, కొంతకాలం ఆలోచించి, ఆ నవలకు "అనామిక" అని పేరెట్టింది. అవును! ఆ పేరే తగిందిగా వుంది! తన నవలలోని స్త్రీ పాత్ర, ఓ అనామిక! ఆమెకు సంఘంలో ఉన్నతస్థానంగానీ, మానమర్యాదలుగానీ, గొప్పదనం గానీ ఏవీ లేవు!

తృప్తిగా నిట్టూర్చి హాయిగా పడుకుని నిద్రపోయింది శారద!

మర్నాడు సాయంత్రం, తన గదిలో కూర్చుని, తదేక ధ్యానంతో సూర్యనారాయణ తను వ్రాసిన కాగితాలు చదవటంచూచి క్షణకాలం ఆశ్చర్యపడింది శారద!

తను వ్రాసిన కథ, అంత వుత్సాహంగా అన్నయ్య చదవటం ఇదే మొదటిసారి! అన్నయ్య అభిప్రాయం ఎలా వుందోనని తెలుసుకుందామనుకుంది గానీ, తనంత తానుగా అడగటానికి అభిమానం అడ్డొచ్చింది శారదకు!

రాత్రి గదిలో పడుకునివున్న శారదకు, ప్రక్కగదిలో, అన్నయ్యా, వదినెల సంభాషణ తలవని తలంపుగా విన్పించింది!

"వదిహేనవతేదీ, ఇక్కడ సారస్వత సభలు జరుగుతాయి రాజీ! నవలల పోటీ నిర్వహింప బడుతోంది! రేపే ఆఖరు తేదీ నవలలు ఇవ్వటానికి! మొదటి బహుమతి వెయ్యిన్నూటపదహార్లు! నువ్వేమైనా రాస్తావా?" సూర్యనారాయణ నవ్వుతున్నాడని స్పష్టంగా బోధపడ్తోంది!

"నేనేం రాస్తాను? రాస్తే మీ చెల్లెలు వ్రాయాలి! మీరు వ్రాయాలి!"

రాజేశ్వరి కంఠంలో ఈర్ష్యా ద్వేషాలు ప్రతిధ్వనిస్తున్నాయి!

ఆ తర్వాత సంభాషణేమిటో శారదకు విన్పించలేదు! కనీసం వినాలనే కూతూహలంకూడా లేదు!

తన "అనామిక" పోటీకి పంపితే? అదృష్టంవుంటే బహుమతి రావచ్చు! తనెన్నో కథలు వ్రాసింది! కానీ వాటన్నిటికంటే "అనామిక" ఎంతో అందంగా కుదిరింది! భాష, శైలి, కథావస్తువూ, అన్నీ తీర్చి దిద్దినట్లు కుదిరాయి!

అన్నయ్యతో ధైర్యంచేసి ఈ సంగతే చెప్పాలి!

మర్నాడుదయం టేబిల్ సొరుగు లాగి "అనామిక" కోసం చూచింది శారద! కానీ కనిపించలేదు! ఇల్లంతా గాలించింది! ఊహూం! వెదికినచోటే వెదికింది! నవ మాసాలూ మోసి, కని పెంచిన బిడ్డ, హఠాత్తుగా చనిపోతే, ఆ తల్లి పడే ఆవేదనలానే వుంది శారద బాధ! రాత్రింబగళ్ళు, శరీరాన్ని కష్టపెట్టి మనస్సును మథించి వ్రాసిన "అనామిక" ఏమైనట్లు? మళ్ళీ తను వ్రాయాలన్నా వ్రాయలేదు ఆ రచన! అన్నయ్యనడుగుదామనుకుంది శారద! కానీ సూర్యనారాయణ క్షణం ఇంటిదగ్గర వుండటం లేదు! సారస్వత సభల ఏర్పాటులో మునిగిపోయి వున్నాడు!

"వదినా! నా రచన చూసేవా?" అంది శారదా రోజు రాజేశ్వరితో!

"నీ రచనలతో నాకేం పనమ్మా? నేనేం రచయిత్రినా? విమర్శకురాలినా?" అంది రాజేశ్వరి.

"అబ్బె అది కాదొదినా! చదవటానికి తీసేవేమో నని..." నసిగింది శారద!

"ఊహూం అంత తీరికెక్కడేడ్చింది నాకు? చాకిరీతోనే సరిపోతుండె!"

అంతలోనే ఏమనుకుందో, ఏమో ... "మీ అన్నయ్య పట్టుకెళ్ళినట్లున్నారు ... !" అంది రాజేశ్వరి.

ఏనుగెక్కినంతగా సంతోషం కలిగింది శారదకు! తన రచన చదివి, అన్నయ్య స్వయంగా పోటీకి తీసికెళ్లాడు! అన్నయ్యది గుప్తప్రేమ! పొంగిపోయింది శారద!

సారస్వత సభలు ముగిశాయి! ఆ రోజు ఆఖరురోజు! ఏ నవలకు, ఏ రచయితకు బహుమతి వచ్చిందో తెలిపే రోజు!

వెయ్యి చెవులు సృష్టించుక, ఎదురు చూస్తోంది శారద!

వరండాలో సూర్యనారాయణ, అతగాడి స్నేహితులు కోలాహలంగా వచ్చి కూర్చున్నారు!

"కంగ్రాచ్యులేషన్స్ సూర్యం! నీ నవల బహుమతి పొందటం మాకెంతో ఆనందంగా వుంది! అయినా మాకెవరికీ మాటమాత్రం తెలియజెయ్యకుండా, ఏకంగా నవల వ్రాసి ప్రైజు కొట్టేశావుకదోయ్? నవల పేరెంత చక్కగా వుందీ? "అనామిక!" ఆహా! ఎంచక్కగా వుందీ భాష, భావాలూ, కూడా!" గోలగోలగా అంటున్నారంతా!

వింటూన్న శారద కాళ్ళక్రింది భూమి కదిలిపోతోనట్లు తోచింది! అనామికకు మొదటి బహుమతి వచ్చింది! కానీ అది రచించిన వ్యక్తి తన అన్నయ్య సూర్యనారాయణా? రాత్రింబగళ్ళు వ్రాసిన తనేమైపోయింది?

"చూడమ్మా! శారదా! బయట తిరిగే మగాడికి పేరు ప్రఖ్యాతులొస్తే అందరికీ ఆనందంగా వుంటుంది! ఇంట్లో

పడుండే వాళ్ళం మనమేం వేదికలెక్కాలా? ఉపన్యాసాలివ్వాలా? చూడు మీ అన్నయ్యగారికి బహుమతి వస్తే, ఎంత మంది ఎలా అభినందిస్తున్నారో!" రాజేశ్వరి మాటలతో, తల తిప్పి చూచింది శారద పిచ్చిగా!

రాజేశ్వరి కళ్ళల్లో స్పష్టంగా కనిపిస్తోంది అభ్యర్థన. "శారదా! మా పరువుతియ్యకు! ఆ నవల నవ్వు వ్రాసినట్లు బయటికి చెప్పకు!" అనే భావనే దాగివుంది!

"నేను... నేను... అనామికనా?" అస్పష్టంగా విడివడ్డ శారద పెదవులు పలికిన మాటలు, ఆమెకే విన్పించలేదు! బయట సూర్యనారాయణ చేత తమకు టీ పార్టీ ఇప్పించుకునే గోలలో వున్నారు సూర్యనారాయణ బృందమంతా!